క్లుప్తంగా

ఏసీపీకి సన్మానం



ఏసీపీ రంగస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: బదిలీపై వెళ్తున్న పట్టణ ఏసీపీ రంగస్వామి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లిను శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, ముబారక్, ఇబ్రహీం, రాయికల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపు హర్షణీయం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు గౌరవం లేకుండా ఉండేదన్నారు. గత పాలకులు ఇష్టం వచ్చినప్పుడు ట్రెజరీలో బ్యాంకు ఖాతాలను ఫ్రీజింగ్ చేశారని, దీంతో సర్పంచులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఎస్‌కే విల్లా కమిటీ సభ్యులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్‌కే విల్లా నూతన కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా విల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై వారు ఎమ్మెల్యేతో చర్చించారు. త్వరలో పరిగి రోడ్డు నుంచి సీఎస్‌కే వరకు 5 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ నూతన అధ్యక్షుడు బంటారం మహేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు అరటి యాదయ్య, ఉపాధ్యక్షులు రమేశ్‌గౌడ్, ఇంజమూరి గోపాల్, ప్రధాన కార్యదర్శి ప్రసన్న, సంయుక్త కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి బాలకృష్ణ, కాలనీవాసులు మహేశ్‌గౌడ్, నాగిళ్ల కిషోర్, దిడ్డి గోపాల్‌నారాయణ, డాక్టర్ శివానంద్, సందీప్, అరుణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్



వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్స్ అందిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

చేవెళ్ల: ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని పట్టణ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఈ న్యూట్రీషన్ కిట్స్ టీబీ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రెండు వారాలకు మించి ఎవరికైనా దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ, ప్రశాంత్, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: రోడ్డు ప్రమాద బాధితులను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. గత మూడురోజుల క్రితం వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై నగరంలోని బంజారాహిల్స్ వీరంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందనవెల్లి, సోలీపేట్ గ్రామాల ప్రజలను గురువారం ఆయన పరామర్శించారు. వారికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

ఆదమరిస్తే అంతే!

- జనవాసాలు, రోడ్ల పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు
- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

నందిగామ: విద్యుత్ ప్రమాదాలతో మూగజీవాలైన పాడి గేదెలు, ఆవులు ప్రతి నిత్యం ఎక్కడో ఒకచోట ప్రాణాలు కోల్పోతున్నాయి. రైతులు కూడా విద్యుదాఘాతాల బారిన పడుతున్నారు. ఎలాంటి రక్షణ సౌకర్యాలు లేకుండా రోడ్ల పక్కన, ఇళ్ల మధ్యన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్న కూడా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేనిచోట, జనవాసాలకు దూరంగా వాటిని ఏర్పాటు చేయాలి కానీ వారి ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపక్కన, ఇళ్ల మధ్యన, పాఠశాలలు, గ్రామపంచాయితీలు తదితర ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుండటంతో తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఎక్కడెక్కడ అంటే..

మేకగూడలోని బస్టాప్‌కు అతి సమీపంలో ఎలాంటి రక్షణ సౌకర్యాలు లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నర్సప్పగూడలో ఎల్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డుకు ఆనుకొని ఒకచోట, శ్రీనివాసులుగూడలో మామిడిపల్లికి వెళ్లే రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారు. చేగూరులోని తిమ్మాపూర్ రోడ్డులో, వీర్లపల్లిలో మామిడిపల్లి రోడ్డుకు ఆనుకొని, అప్పారెడ్డిగూడలో వీర్లపల్లి రోడ్డుకు ఆనుకొని ప్రమాదకర ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

ప్రమాదాలు ఇలా..

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కోసం కంచెలను ఏర్పాటు చేయండి మహాప్రభో అంటూ ఎన్నిసార్లు సంబంధిత విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఫలితం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో విద్యుత్ ప్రమాదాలతో చేగూరులో ఓ పాడి గేదె, వీర్లపల్లిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అదేవిధంగా మామిడిపల్లిలో ఓ వ్యక్తి చేతికి విద్యుత్ షాక్ తగలడంతో రెండు చేతి వేళ్లు కోల్పోయాడు. నర్సప్పగూడలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేయడానికి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అనునిత్యం విద్యుత్ ప్రమాదాలు మండలంలోని ఎక్కడో ఒకచోట చోటు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి రక్షణ లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కనీసం కంచెలు ఏర్పాటు చేసి రక్షణ సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మేకగూడలో బస్టాప్ సమీపంలో..



శ్రీనివాసులుగూడలో రోడ్డు పక్కనే..

కంచెలు ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నర్సప్పగూడలో ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుకు ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కోసం కంచెను ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

–కొంగర భూపాల్, నర్సప్పగూడ

చర్యలు తీసుకుంటాం

మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తాను. ప్రమాదకరంగా ఉన్న వాటి సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఆదేశాలు రాగానే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

–శ్రీధర్, ట్రాన్స్‌కో ఏఈ, నందిగామ

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



శంకర్‌పల్లి: లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా అందుతాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ, మండలంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మొదటగా మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, స్మరించుకున్నారు. అనంతరం మున్సిపాలిటీలో మొత్తం 200ల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వారికి పట్టాలు అందించారు. తర్వాత మండలంలోని గోపులారంలో ఆరుగురికి పట్టాలు అందించి, ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని, సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు, ఎంపీడీఓ వెంకయ్య, మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి మానస, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, గోపులారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చేవెళ్ల: రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మున్సిపాలిటీ, మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ, పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సింగప్పగూడలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని సీపీఐ కాలనీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పథకాలకు సంబంధించిన సమస్యలు ఉంటే, క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి

షాబాద్: నిరుపేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ రాజు, ఏకాంబర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు వారు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సిద్ధం చేయాలి

ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ

కొందుర్గు: ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన లబ్ధిదారులను నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ సూచించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో లబ్ధిదారుల వివరాలు తీసుకొని, వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుకూలంగా స్థలాలను తయారు చేయించాలన్నారు. ఎమ్మెల్యే పనులు ప్రారంభించిన వెంటనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో రైతులకు పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెల షెడ్లు, తదితర పనులు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీఓ విజయ్‌కుమార్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అంతిరెడ్డిగూడలోఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామతో పాటు నర్సప్పగూడ, అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ గ్రామాల్లో గురువారం జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుతం బడుగు, బలహీన వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నర్సప్పగూడ, అంతిరెడ్డిగూడ, జంగోనిగూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన ఎమ్మెల్యే చేశారు. అదేవిధంగా అంతిరెడ్డిగూడలో గ్రామ పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాల పనులను ప్రారంభించారు. అనంతరం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అభివృద్ధికి సంబంధించి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడుతానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ సర్పంచులు కొమ్ము కృష్ణ, కావలి కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్

పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముట్పూర్‌లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర క్వింటాల్‌కు రూ.2320లు ఇవ్వడంతో పాటు రూ.500లు బోనస్ ఇస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. అదేవిధంగా గత ప్రభుత్వం తొలగించిన సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మహిమూద్ షరీఫ్, ఏఈఓ లక్ష్మీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

కేశంపేట: కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గురువారం అధికారులతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎల్లప్పుడూ నిరుపేదల పక్షాన ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని గుర్తుచేశారు. లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన విధంగా నిర్మాణాలను కొనసాగించాలని కోరారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకే నేరుగా బిల్లులను చెల్లిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి పదవులు దక్కడంలేదు

కాంగ్రెస్ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు జొన్నాడ రాజు

మొయినాబాద్: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు దక్కడం లేదని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు జొన్నాడ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. పార్టీలో కొత్తగా చేరినవారికి తరచూ పార్టీలు మారేవారికే పదవులు దక్కుతున్నాయని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు గ్రూపులు కావడంతో పార్టీ కార్యకర్తలు ఎవరి వెంట వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారన్నారు. నామినేటెడ్ పార్టీ పదవుల్లో ఒక వర్గానికే అధిక ప్రాధాన్యత దక్కుతుందని కష్టకాలంలో పార్టీకి పనిచేసిన వారిని విస్మరిస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కార్యకర్తలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై అధిష్టానం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాన్‌ధార్‌ఖాన్‌పేట్ గ్రామంలో బొడ్రాయి, మైసమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో భీంభరత్, మండల నాయకులు పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మానయ్య, తదితరులు ఉన్నారు.

వైభవం.. హనుమాన్ జన్మోత్సవం

హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి, సాయంత్రం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శ్రీ వీరహనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. యువకులు, నాయకులు, భక్తులు కాశాయ జెండాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



కేశంపేట: కాకునూర్‌లో..



షాద్‌నగర్: శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు



షాద్‌నగర్: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు

ఏళ్ల వ్యధ.. తీరిన వేళ

- ఇళ్లపై నుంచి వేసిన తీగల తొలగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

కొత్తూరు: పట్టణంలోని నారాయణగూడ కాలనీలో పలు ఇళ్లపై నుంచి వెళ్లిన హైటెన్షన్ తీగలను తొలగించాలని గత కొన్నేళ్లుగా స్థానికులు, బాధిత ఇళ్ల యజమానులు చేస్తున్న పోరాటం ఫలించింది. ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో ట్రాన్స్‌కో అధికారులు గతంలో ఇళ్లపై నుంచి ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ లైన్లను తొలగించారు. ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారుల కృషిని కొనియాడుతున్నారు.

గతంలో ఇలా..

సుమారు 20 ఏళ్ల కిందట కొత్తూరు పట్టణంలోని నారాయణగూడ కాలనీలో అధికారులు హైటెన్షన్ లైను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇళ్లు తక్కువగా ఉండడంతో అధికారులు పట్టా భూముల్లో నుంచే స్తంభాలు పాతి తీగలను పరిచారు. క్రమంగా పట్టణం విస్తరించడంతో తీగల కిందనే కొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. కాగా పలువురి ఇళ్లపై నుంచి తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. అయినప్పటికీ ఇంటి యజమానులు సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో పలువురు ఇళ్లపైకి ఆయా పనుల నిమిత్తం వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. ఈ క్రమంలో ఇళ్లపై నుంచి వెళ్లిన హైటెన్షన్ తీగలను తొలగించాలని స్థానికులు, ఇళ్ల యజమానులు గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేశారు. పట్టణానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు తమ సమస్య గురించి విన్నవించుకున్నారు. కానీ అప్పట్లో లైన్ షిఫ్టింగ్‌కు ట్రాన్స్‌కో అధికారులు నిధులు భరించలేమని చెప్పడంతో సమస్య పరిష్కారంపై ఆశలు వదులుకున్నారు.



ఇళ్లపై నుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు(ఫైల్)



విద్యుత్ తీగలు తొలగిస్తున్న సిబ్బంది

గత పదేళ్ల నుంచి వేడుకుంటున్నాం



ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా వేలాడుతున్న హైటెన్షన్ తీగలు, స్తంభాలను తొలగించాలని గత పదేళ్ల నుంచి ట్రాన్స్‌కో అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నాం. సమస్య పరిష్కరించాలని పలుమార్లు పట్టణంలో ఆందోళనలు సైతం నిర్వహించాం. ప్రస్తుత ప్రభుత్వంలో సమస్య పరిష్కారం కావడం సంతోషకరం.

– చందు, కొత్తూరు

ఎమ్మెల్యే చొరవతోనే..



మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో పలు ఇళ్లపై నుంచి ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని తొలగించాలని వార్డు వాసులతో కలిసి ఎమ్మెల్యేకు విన్నవించాం. దీంతో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఏడాదిలోపు తీగలను తొలగిస్తానని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తీగలను తొలగించడం సంతోషకరం.

– వీరమోని హేమదేవేందర్, 6వ వార్డు కౌన్సిలర్